క్లుప్తంగా

భూ సేకరణపై ఆర్డీవో సమీక్ష

శంకరపట్నం: జాతీయ రహదారి నిర్మాణం కోసం మండలంలోని రైతుల భూముల సేకరణపై సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో హుజురాబాద్ ఆర్డీవో రమేశ్‌బాబు సమీక్ష నిర్వహించారు. బైపాస్ రోడ్డు నిర్మాణం తదితర వివరాలకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్ భాస్కర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయక ఉత్సవాలు జరుపుకోవాలి

చొప్పదండి: వినాయక నవరాత్రులను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు పడకంటి కృష్ణ కోరారు. సోమవారం విలేకరులతో మాట్లాడారు. మండపాల చుట్టూ పరిసరాల శుభ్రత పాటించాలని, తులసి, కుంకుమ, గోమాత పూజలు, అన్నదానం నిర్వహించాలన్నారు. ఉత్సవాల్లో మహిళల భాగస్వామ్యం ఉండేలా, భక్తిశ్రద్ధలతో నవరాత్రులను నిర్వహించుకుంటూ ఆదర్శంగా నిలవాలని కోరారు. వెంట మొలుమూరి రమేశ్, దూస రాము, దండె లింగన్న, ఎన్నం మునీందర్, సిరిపురం శ్రీనివాస్, దండె మహేశ్, చల్ల అనూక్ పాల్గొన్నారు.

శిఖం భూమి కాపాడాలి

చొప్పదండి: పట్టణంలోని బ్రాహ్మణకుంట శిఖం భూమిని కాపాడాలని ఏఐఎఫ్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. చెరువులు, కుంటలకు సంబంధించిన ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లను నిర్ధారించాలని కోరారు. హద్దులు నిర్ణయించకుండా ఎన్‌వోసీ సర్టిఫికెట్లు ఇవ్వకుండా చూడాలని కోరారు. గతేడాది కూడా ఫిర్యాదు చేసినట్లు వివరించారు. వెంట జిల్లా కమిటీ సభ్యుడు బెక్కంటి రమేశ్, తదితరులున్నారు.

బండి సంజయ్‌ని కలిసిన మల్లారెడ్డిపల్లి నాయకులు

వీణవంక: మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామ బీజేపీ నాయకులు కరీంనగర్‌లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. గ్రామంలో మంచినీటి సమస్య ఉందని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రఘు, నాని, కొలిపాక శ్రీనివాస్, అర్షం శ్రీనివాస్, గోనెల పెద్దులు, రాయవేణ సమ్మయ్య, కొలిపాక విరేందర్, రాయవేణ తిరుపతి, దూలం నరేశ్, హరీశ్, సురేశ్, అనిల్, సంపత్, బిట్టు , విక్కి, ఉన్నారు.

ఆటో యూనియన్ కార్యవర్గం

చొప్పదండి: పట్టణంలోని ఆటో యూనియన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తీగల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా సూర్ల రాజు, కోశాధికారిగా బొడిగె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా మల్యాల తిరుపతి, ప్రధాన సలహాదారుడిగా ఎండీ ఖలీల్ నియామకమయ్యారు.

'రైతుల సమస్యలను ప్రభుత్వం విస్మరించింది'

వీణవంక: రైతుల సమస్యలను ప్రభుత్వం విస్మరించిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కాసర్ల సుధాకర్ అన్నారు. మండలంలోని కొండపాక గ్రామంలో మాట్లాడారు. రైతుల పెట్టుబడి కోసం మాజీ సీఎం కేసీఆర్ రైతుబంధు పథకం ప్రవేశపెట్టారని, ప్రతి సీజన్‌కు రైతుల ఖాతాలో డబ్బులు వేశాడని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్టుబడి డబ్బులు వేయకుండా కాలయాపన చేస్తుందని, రైతులు పెట్టుబడి కోసం అప్పులు చేస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రభుత్వం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రైతుభరోసా డబ్బులను రుణమాఫీకి బదిలీ చేసి రైతులను నట్టేట ముంచారని, వానాకాలం సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడిచినా ఇప్పటి వరకు రైతభరోసా డబ్బులు జమకాకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతుభరోసా డబ్బులు రైతుల ఖాతాలో వేయాలని డిమాండ్ చేశారు.

ఏడుగురి బైండోవర్

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం గ్రామంలో గుడంబా తయారు చేస్తున్న ఏడుగురిని తహసీల్దార్ భాస్కర్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. కేశవపట్నం గ్రామానికి చెందిన గొల్లెన కుమార్, కల్లూరి రాజకొంరయ్య, స్వరూప, రేణుక, శ్రీను, పద్మ, లక్ష్మిని బైండోవర్ చేశామన్నారు.

జిట్టా బాలకృష్ణారెడ్డికి నివాళి



కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న నాయకులు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట ప్రధాన చౌరస్తా వద్ద సోమవారం సాయంత్రం జిట్టా బాలకృష్ణారెడ్డి చిత్రపటానికి యువజన సంఘాల నాయకులు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జాతీయ యువజన అవార్డు గ్రహీత అలువాల విష్ణు, యువజన సంఘాల ప్రతినిధులు, యువకులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'అసంపూర్తి' అవస్థలు

- పూర్తికాని మనఊరు–మనబడి పునర్నిర్మాణ పనులు
- మండలంలో ఐదు జెడ్పీహెచ్ఎస్, ఆరు ప్రాథమిక స్కూళ్లు ఎంపిక
- మూడు స్కూళ్లలో వందశాతం పనులు
- మిగతా వాటికి విడుదల కాని నిధులు
- పట్టించుకోని అధికారులు



చిగురుమామిడి ప్రాథమిక పాఠశాలలో పూర్తికాని తరగతి గదుల నిర్మాణం



చిగురుమామిడి జెడ్పీపాఠశాలలో పూర్తికాని డైనింగ్ హాల్

చిగురుమామిడి: మండలంలో 'మన ఊరు–మన బడి' కార్యక్రమం కింద శిథిలావస్థకు చేరిన పాఠశాలల్లో పునర్నిర్మాణ పనులకు గత ప్రభుత్వం పదకొండు స్కూళ్లను ఎంపిక చేసింది. రెండేళ్లు కావస్తున్నా అధికారుల అలసత్వం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం తదితర కారణాలతో పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ఇందుర్తి, చిగురుమామిడి, రేకొండ, సుందరగిరి, నవాబుపేట, చిన్నముల్కనూర్ జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలలకు 2022–23 విద్యా సంవత్సరంలో నిధులు మంజూరయ్యాయి. ఐదు జెడ్పీహెచ్ఎస్‌లకు ఒక్కోదానికి రూ.20 లక్షలు, ప్రాథమిక పాఠశాలలకు ఒక్కోదానికి రూ.ఎనిమిది నుంచి పదకొండూ లక్షల వరకు నిధులు మంజూరైనా యాభైశాతం పనులు పూర్తికాకపోవడంతో ఆయా గ్రామాల్లో తీవ్ర నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నిధులతో మైనర్ రిపేర్లు, కలర్స్, కంప్యూటర్ ల్యాబ్, కరెంట్ వైరింగ్, టాయిలెట్స్, డిజిటల్ టీవీ, ఇన్‌వర్టర్లు, డైనింగ్‌హాల్, మోడర్న్ కిచెన్ షెడ్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ చాలా పాఠశాలల్లో పనులు ఇంకా పూర్తి కాలేదు. నిధుల విడుదలలో ఆలస్యం కారణంగా పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌లకు బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నారు. నవాబుపేట, సుందరగిరి, ఎంపీపీఎస్ చిన్నముల్కనూర్ పాఠశాలల్లో మాత్రమే వంద శాతం పనులు పూర్తయ్యాయి. మిగతా వాటికి నిధులు మాత్రం నామమాత్రంగా విడుదలయ్యాయి. నిలిచిన పనులపై జిల్లా, మండల స్థాయి అధికారులు పట్టించుకోకపోవడం లేదు. దీంతో విద్యార్థులకు మంచి విద్యాబోధన అందించాలన్న ప్రభుత్వ సంకల్పం నెరవేరేలా లేదు. ఇందుర్తి, చిగురుమామిడి, రేకొండ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలకు ఆరు చొప్పున కంప్యూటర్లు వచ్చాయి. ఎనిమిదో నుంచి పదోతరగతి చదివే విద్యార్థులకు కంప్యూటర్ విద్యపై అవగాహన కల్పించనున్నారు. నవాబుపేట, సుందరగిరికి విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందని ద్రాక్షగా మారింది. కిచెన్‌షెడ్లు పూర్తికాక వర్షాకాలంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఇబ్బంది పడుతున్నారు. డైనింగ్ హాల్ నిర్మాణం పూర్తికాక విద్యార్థులు ఆరుబయట మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. పనులు సత్వరం పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వరండాల్లో భోజనం



కిచెన్‌షెడ్లు పూర్తికాక మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఇబ్బంది పడుతున్నారు. వంటగది రేకులు గాలికి లేచిపోతున్నాయి. డైనింగ్ హాల్ పూర్తికాక విద్యార్థులు వరండాల్లో భోజనం చేస్తున్నారు.

– రాజేంద్రప్రసాద్, హెచ్‌ఎం జెడ్పీహెచ్ఎస్, చిగురుమామిడి

పనుల పూర్తికి కృషి



అసంపూర్తి పనులను జిల్లా విద్యాశాఖాధికారి దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకువెళ్లి పనులు పూర్తయ్యేందుకు కృషి చేస్తాం. కొన్ని పాఠశాలల్లో పూర్తయిన పనులకు బిల్లులు రావాల్సి ఉంది.

– శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈఓ, చిగురుమామిడి





హుజూరాబాద్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో కాళోజీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు, ఇల్లందకుంట మండలం శ్రీరాములపల్లి కేజీబీవీలో..

ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ప్రజాకవి, పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఆంజనేయరావు కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. తెలంగాణ ఉద్యమంలో కాళోజీ కీలక పాత్ర వహించారని, తెలంగాణ భాషా మాండలికాన్ని కాపాడిన గొప్ప వ్యక్తి అని, ఆయన రచనల గూర్చి వివరించారు. కళాశాల తెలుగు అధ్యాపకులు తులసీదాసు, శైలజ, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో కాళోజీ జయంతి నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా.పి. ఇందిరాదేవి మాట్లాడుతూ... తెలంగాణ భాషా గుర్తింపు కోసం కాళోజీ ఎనలేని కృషి చేశారని అన్నారు. తెలుగు విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ వైస్ ప్రిన్సిపాల్ డా. కొత్తిరెడ్డి మల్లారెడ్డి మాట్లాడుతూ..సామాజిక అసమానతలు రూపుమాపడానికి కాళోజీ కవిత్వాన్ని ఆయుధంగా మలుచుకున్నారని కొనియాడారు. కాళోజీ జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకోవడం తెలంగాణ జాతి ఆయనకు ఇచ్చే నివాళి అని పేర్కొన్నారు. అకాడమిక్ కో ఆర్డినేటర్ కె.లింగారెడ్డి, అధ్యాపకులు మహిపాల్‌రెడ్డి, ఓదెలు, స్వరూపారాణి, రేణుక, సుమలత, పల్లవి, రమ, మంగమ్మ, స్వప్న పాల్గొన్నారు.

దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే

దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉందని హుజూరాబాద్ టౌన్ సీఐ తిరుమల్ అన్నారు. పట్టణంలోని శ్రీవాగ్దేవి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కాళోజీ జయంతి కార్యక్రమంలో మాట్లాడారు. ప్రముఖ సాహితీ వేత్త ఎస్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... కవులు, రచయితలు, మేధావుల రచనలు చదవడమే కాకుండా వారి ఆలోచన విధానాలను అవలంబించాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ ఏనుగు మహిపాల్ రెడ్డి, ప్రిన్సిపల్ ప్రవీణ్ రెడ్డి, తెలుగు అధ్యాపకుడు, కవి, గాయకులు నవీన్‌కుమార్, అధ్యాపకులు తిరుపతి, భద్రయ్య, అనిల్, వేణు పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ ఓదేల్‌కుమార్ అధ్యక్షతన తెలుగు విభాగం ఆధ్వర్యంలో కాళోజీ జయంతి నిర్వహించారు. భాషా, యాస ఔన్నత్యాన్ని వెలుగులోకి తెచ్చిన గొప్ప ప్రజాకవి, భాషా, సాహిత్య అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. అధ్యాపకులు శ్యా మల, రాజేంద్రం, గణేష్, మాధవి, ఉమాకిరణ్, రాజకుమార్, కిరణ్‌కుమార్, రవి, శ్రీని వాస్‌రెడ్డి, రవీందర్, సుష్మా, రవిప్రకాశ్, ప్రశాంత్, అరుణ్‌రాజ్, సాయికుమార్, అనూష పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కాళోజీ చిత్రపటానికి టీచర్లు పూలమాలలు వేసి నివాళి అర్పించారు తెలుగు భాషా ఉపాధ్యాయురాలు ఆదిలక్ష్మిని సన్మానించారు.

చిగురుమామిడి: చిమండలంలోని ఇందుర్తి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖనం, నా టకాలు, పాటలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. కాళోజీ నారాయణరావు సేవలను టీచర్లు కొనియాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జయప్రద, టీచర్లు ఓదెలుకుమార్, తిరుపతి, సవిత, మంజుల, వేణు, చారి, మాధవి, శ్రీదేవి, జయప్రకాశ్ పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండలంలోని శ్రీరాములపల్లి కేజీబీవీలో తెలంగాణ భాషా దినోత్సవం పాఠశాల ప్రత్యేక అధికారి బి.రమాదేవి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే మల్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ భాషా దినోత్సవం జరుపుకున్నారు. కేజీబీవీ, టీచర్లు, అధ్యాపకులు, మల్యాల స్కూల్ హెచ్‌ఎం కె.రాములు, ఉపాధ్యాయులు విజేందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, పద్మ, రాజేశ్‌బాబు, ప్రణీత, రేష్మ, అరుణ పాల్గొన్నారు.

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. హెచ్‌ఎం పసుపునూరి శ్రీధర్, గట్టు శ్రీవాణి, సముద్రాల అంజ య్య, సంఘంబట్ల సురేందర్, శారద, మల్లికార్జున్, ఉమాదేవి పాల్గొన్నారు.



చొప్పదండి: రుక్మాపూర్‌లో...



జమ్మికుంటలో...



హుజూరాబాద్: మాట్లాడుతున్న సీఐ తిరుమల్



శంకరపట్నం: మొలంగూర్‌లో...



చిగురుమామిడి: ఇందుర్తిలో వ్యాసరచన పోటీలు..

ఇబ్బందులకు గురిచేస్తున్నాడని తహసీల్దార్‌కు ఫిర్యాదు

జమ్మికుంట: మండలంలోని మడిపల్లి పెద్ద చెరువులో పట్టా భూములున్నా కావాలనే చెరువు శిఖం భూమి అంటూ కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మ్యాకమల్ల అశోక్ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, తప్పుడు ఆరోపణలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బండి భిక్షపతి, పైతరి రవి, శ్రీధర్, గురుకుంట్ల రాజయ్య, దాసారపు మల్లయ్య తహసీల్దార్ రమేశ్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. గతంలో కలెక్టర్, ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇవ్వగా సర్వే నిర్వహించి, చెరువు భూమిని గుర్తించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

చెరువు కబ్జాకు గురైందని ఫిర్యాదు చేశాను..

చెరువు కబ్జాకు గురైందని నాలుగు రోజుల క్రితం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసింది వాస్తవమేనని మ్యాకమల్ల అశోక్ ప్రకటనలో తెలిపారు. కబ్జాపై ఎలాంటి విచారణ జరపకుండానే కొందరు నాపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడం, ఇబ్బందులకు గురిచేస్తున్నానని అనడం అవాస్తవమని, కబ్జా విషయంపై అధికారులు విచారణ చేసి తేల్చి చెప్తారని ప్రకటనలో పేర్కొన్నారు.



తహసీల్దార్ రమేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న భిక్షపతి, రవి, శ్రీధర్ తదితరులు

మానకొండూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

మానకొండూర్: మానకొండూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు, డైరెక్టర్ రాజుయాదవ్‌ను జిల్లా, మండల యాదవ సంఘం నాయకులు సోమవారం సన్మానించారు. ఈసందర్భంగా జీఎంపీవీఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్‌యాదవ్ మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో యాదవుల జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు యాదవులు ముందుకు రావాలని సూచించారు. కలిసికట్టుగా యాదవులను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో బాకారపు శ్రీనివాస్, గడ్డి గణేశ్, జిట్టా కొమురెల్లి, రాకేశ్, మహేశ్, గాలి రమేశ్, లింగయ్య, మల్లయ్య, రాజమల్లు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న యాదవ సంఘం నాయకులు



- ఎన్నం మునీందర్, చొప్పదండి

చొప్పదండి: పట్టణంలోని ప్రధాన రోడ్డుపై గుంతలు ఏర్పడి ప్రయాణానికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గంతలు పూడ్చి అసంపూర్తి రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు. డివైడర్‌కు ఒకవైపు ఎదురెదురుగా వాహనాలు వెళ్లలేక ప్రమాదాలు జరుగుతున్నాయి.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి

నాగరాజు, చొప్పదండి మున్సిపల్ కమిషనర్, సెల్ నం : 99492 67882

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9848408781, 8790144227, 9553955664

బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తుల ఆందోళన

శంకరపట్నం: కేశవపట్నం వాగుపై బ్రిడ్జి నిర్మించాలని చెర్లపల్లి గ్రామస్తులు సోమవారం ఆందోళన చేపట్టారు. భారీ వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి వరదనీరు కేశవపట్నం –చెర్లపల్లి గ్రామాల మధ్య ఉన్న కల్వర్టు పైనుంచి ప్రవహిస్తుండటంతో పది రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. కేశవపట్నంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకునే పిల్లలు, నిత్యావసర సరుకులు తెచ్చుకోవడానికి వెళ్లేవారు ఇబ్బందులుపడుతున్నారు. వాగు దాటొద్దని తహసీల్దార్, ఎస్సై ప్రజలకు అవగాహన కల్పించడంలేదని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో ఓట్లు వేయమని తీర్మానం చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ స్పందించి బ్రిడ్జి నిర్మించాలని కోరారు.



ఆందోళన చేస్తున్న చెర్లపల్లి గ్రామస్తులు

'దళితబంధు' నిధులు మంజూరు చేయాలి



నిరసన తెలుపుతున్న దళితబంధు సాధన సమితి సభ్యులు

ఇల్లందకుంట: మండలంలోని దళితబంధు సాధన సమితి ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ కూడలి వద్ద సోమవారం దళితబంధు రెండో విడత నిధులు మంజూరు చేయాలని సమితి సభ్యులు వినూత్న నిరసన తెలిపారు. ప్రభుత్వం వెంటనే రెండో విడత నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే నియోజకవర్గంలోని దళితులందరం ఏకమై రాష్ట్ర వ్యాప్త ఆందోళనలతో ప్రభుత్వాన్ని ఎండగట్టేదిశగా ముందుకెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో దళితబంధు సాధన సమితి సభ్యులు సురేశ్, రాజేశ్, నరేశ్, ఆకాష్, భిక్షపతి, రక్షిత్, ప్రవీణ్, సరిత, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ



శ్రీకాంత్‌రెడ్డి

హుజూరాబాద్/జమ్మికుంట: జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ పారిపెల్లి శ్రీకాంత్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ...హుజూరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సర్జన్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు తీసుకున్నానని, ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తానన్నారు. హాస్పిటల్‌లో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా ప్రయత్నం చేస్తానన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా సిబ్బందితో కలిసి పనిచేస్తానని, ప్రజలందరూ సహకరించాలని కోరారు.

విఘ్నేశ్వరునికి పూజలు

జమ్మికుంట: మున్సిపల్ పరిధి, మండలంలో వినాయక నవరాత్రి వేడుకలను సోమవారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. మారుతినగర్‌లో ముస్లిం మహిళ ఎండీ అజియా గణపతి పూజలో పాల్గొనగా కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు.

నిమజ్జనం ఏర్పాట్లు పరిశీలన

జమ్మికుంట: పట్టణంలో వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నాయిని చెరువు ప్రాంతంలో వినాయక నిమజ్జనం ఏర్పాట్లను సోమవారం రాత్రి డీసీపీ లక్ష్మీనారాయణ పరిశీలించారు. హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ, టౌన్ సీఐ వరంగంటి రవికి పలు చూచనలు చేశారు. పట్టణంలోని పలు మండలపాలను సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏకాగ్రతతోనే చదువులో రాణింపు



విద్యార్థులతో మాట్లాడుతున్న వేణుకుమార్

రామడుగు: మండలంలోని వెలిచాల సరస్వతి, గోపాల్‌రావుపేట శ్రీప్రగతి పాఠశాలలో సోమవారం మెమొరీ అండ్ సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ దైవాల వేణుకుమార్ కాంపిటేటివ్ పరీక్షల్లో రాణించేందుకు ఉపయోగపడే అంశాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ఏకాగ్రతతో చదివినప్పుడే చదువులో రాణిస్తారని, చదివిన అంశాలు గుర్తుండటానికి టెక్నిక్స్, టిప్స్ తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్స్ ఉప్పుల శ్రీనివాస్, అన్నదానం రాధాకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీటమునిగిన పంటలకు పరిహారం అందించాలి

చిగురుమామిడి: భారీ వర్షాలకు నీటి మునిగిన పంటలకు ప్రభుత్వం తక్షణం నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కాంతాల శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం చిగురుమామిడిలో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా నీటి మునిగిన పంటల సర్వే చేయకపోవడం విడ్డూరమని, వ్యవసాయ, రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలన చేయకపోవడం దారుణమన్నారు. నష్టపోయిన రైతులకు పరిహారం అందించకుంటే రైతులతో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు నిర్వహిస్తామన్నారు.